ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
వరంగల్
ఉమ్మడి జిల్లా
సోమవారం 20 అక్టోబరు 2025

ఉపాధి పనులొస్తున్నాయ్..



- 2026-27 ఆర్థిక సంవత్సరం పనుల గుర్తింపు
- త్వరలో గ్రామ సభల నిర్వహణ.. వచ్చే నెలలోగా పూర్తి
- ఉపాధి పనుల గుర్తింపులో స్థానిక అవసరాలకు పెద్దపీట
- ఇందిరమ్మ ఇంటికి ఉపాధి హామీ అనుసంధానం
- ఒక్కో లబ్ధిదారుడికి రూ.30,700 ఆదాయం

హనుమకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కసరత్తు చేస్తోంది. గ్రామాల్లో వలసలు నివారించడంతో పాటు వారికి పని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం తీసుకువచ్చింది. దీని ద్వారా గ్రామాల్లోని కూలీలు వలస వెళ్లకుండా నియంత్రిస్తూ ఊళ్లోనే ఉపాధి కల్పించడానికి పనులు చేపడతారు. 2006లో ఈ పథకాన్ని ప్రారంభించగా ఇందులో ఎక్కువ మంది ప్రస్తుతం స్వగ్రామంలోనే ఉపాధి పొందుతున్నారు. ఉపాధి పనుల్లో ముఖ్యంగా మహిళలు, యువతీ యువకులు ఎక్కువగా పాల్గొంటున్నారు.

గ్రామ సభలు

ఉపాధిహామీ పథకానికి సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనుల గుర్తింపు కోసం గ్రామసభలను నిర్వహించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో 2026-27లో చేపట్టే పనులను ఇప్పటి నుంచే గుర్తించనున్నారు. జిల్లాలోని 210 గ్రామ పంచాయతీల్లో వచ్చే నెలాఖరులోగా గ్రామసభలు పూర్తి చేసి అక్టోబర్‌లో మండలాల వారీగా ప్రణాళికలు తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తారు. వాటిని క్రోడీకరించి రాష్ట్రస్థాయిలో ఆమోదానికి ప్రతిపాదిస్తారు. వాస్తవానికి అక్టోబర్ 2 నుంచి వీటిని నిర్వహించాల్సి ఉంది. కానీ స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలుతో వాయిదా పడింది. ప్రస్తుతం ఎన్నికల నియమావళి లేనందువల్ల పనులు గుర్తించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సూచనల మేరకు ఉపాధి హామీ పథకం అమలు కోసం ఏపీవోలు కార్యాచరణ రూపొందిస్తున్నారు. వచ్చే వారం నుంచి గ్రామ సభలను నిర్వహించి నవంబర్‌లో పూర్తి చేయనున్నారు. ఏపీవోలు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు గ్రామాల్లో పనులు గుర్తించే పనిలో నిమగ్నం కానున్నారు.

స్థానిక అవసరాలకు పెద్దపీట

ఉపాధి హామీ పథకంలో ఈసారి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు అవకాశం కల్పించారు. కూలీలను ఇందుకోసం వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భారీ వర్షాలకు పంట చేన్లలో గండ్లు పడ్డాయి. వాటి మరమ్మతులతో పాటు జల సంరక్షణకు ఇంకుడుగుంతలు, కాల్వల పనులు, కందకాల తవ్వకాల వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వన మహోత్సవంలో మొక్కలు నాటడం, నర్సరీలు, పండ్ల తోటల పెంపకం, పంట కల్లాల నిర్మాణం, పశువులు, జీవాల షెడ్లు వంటి పనులను ఎంపిక చేయనున్నారు. పథకంలో 58 రకాల పనుల్లో ఆయా గ్రామాల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యం కల్పిస్తారు.

వంద రోజుల పని

పథకంలో భాగస్వాములైన కూలీలందరికీ ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇందులో భాగంగా ముందుగా గ్రామాలకు అవసరమైన పనులు గుర్తించడంతో పాటు ప్రజల అంగీకారం తప్పనిసరి కావడంతో గ్రామసభలు నిర్వహిస్తారు. ఇందులో పనులకయ్యే ఖర్చు వివరాలు తయారు చేసి తీర్మానాలను ఉపాధి హామీ వెబ్‌సైట్‌లో పొందుపరిచి ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

10.40 లక్షల జాబ్ కార్డులు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 75 మండలాలు, 1708 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో మొత్తం జాబ్‌కార్డులు 10,40,886 ఉన్నాయి. కూలీలు 20,62,314 మంది ఉన్నారు. క్రియాశీల జాబ్ కార్డులు 6,59,850 ఉండగా, క్రియాశీల కూలీలు 12,39,066 ఉన్నారు. కొత్త జాబ్ కార్డులు జారీ చేయనున్న నేపథ్యంలో వచ్చే కూలీల సంఖ్య కూడా పెరగనున్నట్లు తెలుస్తోంది.

ఈజీఎస్‌తో ఇందిరమ్మ ఇల్లు లింకు

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఉపాధి హామీని ప్రభుత్వం అనుసంధానం చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. పేదలకు గృహ నిర్మాణానికి తోడుగా నిలబడంతో పాటు గ్రామీణ నిరుద్యోగులకు కనీసం 100 రోజుల పని దినాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 39,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఈ లబ్ధిదారుల్లో 36,000 మందికి ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయి. మిగిలిన 3 వేల మంది జాబ్‌కార్డులు లేనివారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఆమోదించేలా చర్యలు తీసుకుంటున్నారు. కొత్తగా పెళ్లయిన మహిళకు ఇల్లు మంజూరైతే అప్పటికప్పుడు ఎంపీడీవో ద్వారా జాబ్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, ఒక్కో ఇందిరమ్మ ఇంటికి ఉపాధి హామీ పథకం కింద రూ.27వేలు, స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) కింద రూ.12 వేలు అందనున్నాయి. అయితే ప్రతీ ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ఉపాధి కింద పని దినాలను కేటాయించనున్నారు. ప్రస్తుతం ఉపాధి కూలీలకు రోజుకు రూ.307 వేతనం లభిస్తుంది. ఈ లెక్కన 100 రోజుల పాటు పని చేయడం ద్వారా ఒక్కో కూలీకి రూ.30,700 వరకు ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. వీటితో పాటు ఎస్‌జీఎంలో మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు ఇతర పారిశుధ్య పనులకు రూ.12 వేలు ఇవ్వనున్నారు. అంతేకాకుండా ఒక్కో ఇంటికి 'పీఎం ఆవాస్ యోజన' కింద రూ.72 వేలు ఇస్తుండగా ఇప్పుడు ఉపాధి హామీ, స్వచ్ఛ భారత్ నిధులు అందించనుండడంతో లబ్ధిదారులకు అదనపు ప్రయోజనం చేకూరనుంది. ఉపాధి హామీ పథకాన్ని ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని అనుసంధానించిన నేపథ్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో రూపొందించిన పనుల ప్రణాళికలను ప్రధానంగా దీనిని దృష్టిలో పెట్టుకొని రూపొందిస్తారు. దీనితో ఉపాధి ప్రణాళికలు కొత్త రూపును సంతరించుకోనున్నాయి.

రేపు ఎంబీఏ, ఎంసీఏ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

కేయూ క్యాంపస్ అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లర్నింగ్ (కేయూఎస్ఎల్)లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్, కేయూఎస్ఎల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కల్గిన అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్ల కోసం అక్టోబరు 21వ తేదీన ఎస్డీఎల్‌సీఈలో సంప్రదించాలని కోరారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో సీటు రాని అభ్యర్థులు అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు. ఖాళీ సీట్ల వివరాలు కేయూ ఎస్ఎల్ నోటీసు బోర్డుపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర వివరాలకు tgicet.nic.inలో చూడాలని సూచించారు. అడ్మిషన్లు టీజీఐసెట్-2025 మార్గదర్శకాలకు అనుగుణంగా కల్పిస్తామని పేర్కొన్నారు.







వివరములు	వడ్డీ రేట్లు	సీనియర్ సిటిజన్స్
1) సేవింగ్స్ డిపాజిట్లపై	3.00 %	3.00 %
2) ఫిక్స్‌డ్ డిపాజిట్లపై		
7 రోజుల నుండి 90 రోజుల వరకు	5.50%	6.00%
91 రోజుల నుండి 180 రోజుల వరకు	5.70%	6.20%
181 రోజుల నుండి 1 సం॥ వరకు	6.00%	6.50%
1 సం॥ పైబడి నుండి 3 సం॥ల వరకు	7.50%	8.00%
3 సం॥ పైబడి నుండి 10 సం॥ల వరకు	7.25%	7.75%

సీజేఐపై దాడి చేస్తే చర్యలేవి?



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

- ఇంకా కేసు ఎందుకు నమోదు చేయలేదు..?
- గవాయ్‌పై దాడికి నిరసనగా హైదరాబాద్‌లో ఆత్మగౌరవ ర్యాలీ
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

హసన్‌పర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చీఫ్ జస్టిస్ బీఆర్.గవాయ్‌పై దాడి జరిగిన వ్యక్తిపై కేసు ఎందుకు నమోదు చేయలేదని ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట కేఎల్ఎన్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణమాదిగ హాజరై మాట్లాడారు. దేశ రాజధానిలో అత్యున్నత న్యాయవ్యవస్థ సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్.గవాయ్‌పై దాడి జరిగితే ఇంకా కేసులు ఎందుకు నమోదు చేయడం లేదన్నారు. ఎన్నో కేసులు సుమోటాగా స్వీకరిస్తున్న పోలీసు, న్యాయవ్యవస్థకు చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడి కనిపించడం లేదా అని దుయ్యబట్టారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ స్థానంలో ఉన్న దళితుడికి రక్షణ లేకపోతే దేశంలో సామాన్య దళితులకు రక్షణ ఎలా ఉంటుందన్నారు. ఈ దాడి జరిగి 12 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. జస్టిస్ గవాయ్ స్థానంలో ఉన్నత కులాలకు చెందిన జడ్జి ఉంటే కేసు నమోదు చేయడంలో ఇలా నిర్లక్ష్యం చేసి ఉండేవారా? అని ప్రశ్నించారు. తక్షణమే దాడి ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి జైలులో పెట్టాలన్నారు. అలాగే ఈ ఘటనపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించి దీని వెనక ఉన్న శక్తులను గుర్తించాలన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి విషయంలో న్యాయాన్ని కోరుతూ నవంబరు 1న లక్షలాది మందితో చలో హైద రాబాద్ పేరుతో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

ఈ సమావేశంలో ఎంఎస్‌పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజన్ వెంకటస్వామిమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్‌మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షులు బండారి సురేందర్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు బొడ్డు దయాకర్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతిమాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంద రాజుమాదిగ, మాదిగ మహిళా జాతీయ నాయకురాలు లత మాదిగ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నేత డాక్టర్ పుల్ల శ్రీనివాస్‌మాదిగ, మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు వెంకటరత్నంమాదిగ, ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు పుట్ట రవిమాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితి కోర్ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు పాల్గొన్నారు.





ట్రాక్టర్ అపహరణ

ఏటూరునాగారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఓ రైతుకు చెందిన ట్రాక్టర్‌ను అపహరించిన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఆకులవారిఘణపురం గ్రామానికి చెందిన రైతు దొడ్డ సాంబయ్య ట్రాక్టరును ట్రాలీ సహా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వద్ద నుంచి దొంగలించారని సాంబయ్య పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు


పాషా (ఫైల్)

వెంకటాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని అలుబాక గ్రామానికి చెందిన వ్యక్తి గోదావరిలో గల్లంతైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని పాషా అనే వ్యక్తి గోదావరిలంకల్లో పుచ్చతోట సాగు చేస్తున్నాడు. ఆదివారం ఉదయం పుచ్చతోటను చూసి వచ్చేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా గోదావరి నదిలో ఉన్న నీటి మడుగును దాటే క్రమంలో ప్రమాదవశాత్తు కాళ్లు లోతులోకి వెళ్లి గల్లంతయ్యాడు. పాషా కోసం గ్రామస్థులు నాటుపడవల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

టేకు కలప పట్టివేత


బొలెరో వాహనంలో తరలిపోతున్న దుంగలు

ఏటూరునాగారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భారీ మొత్తంలో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను ములుగు జిల్లా ఏటూరునాగారంలో అటవీశాఖ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం తెల్లవారుజామున ఏటూరునాగారం మీదుగా హనుమకొండ వైపు టేకు కలపను అక్రమంగా తరలిస్తుండగా చిన్నబోయినపల్లి గ్రామం వద్ద గ్రామస్థులు గుర్తించారు. వాహనాన్ని పట్టుకొని ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారులు చిన్నబోయినపల్లికి చేరుకొని టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి కలపను ఏటూరునాగారంలోని అటవీశాఖ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేశారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

- ఎమ్మెల్యేకు కూనూరు వాసుల వినతి


ఎమ్మెల్యే శ్రీహరిని కలిసిన కూనూరు గ్రామస్థులు

జఫర్‌గఢ్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కూనూరులోని బతుకమ్మ స్థలం, శ్మశానవాటిక, నర్సరీతోపాటు పెద్దమ్మ గుడికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని స్థానికులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు. ఆదివారం కూనూరు ముదిరాజ్‌లతో పాటు వివిధ కుల సంఘాల ప్రతినిధులు హనుమకొండలోని నివాసంలో కడియంను కలిసి వినతి పత్రం అందించారు. ముదిరాజ్ ఆలయానికి, శ్మశానవాటిక, బతుకమ్మ ఆడే స్థలం వరకు విద్యుత్ లైను లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రత్యేక లైనుతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు గ్రామస్థులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చిరబోయిన శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కాటం మల్లారెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శాస్త్రబోయిన సంపత్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దాట్ల అశోక్, నెల్లుట్ల అజయ్‌కుమార్, కాటం రాజిరెడ్డి, చేగొండ నరహరి, నమ్మిరెడ్డి, ఎన్.బిక్షపతి, కోట సతీష్, రాంప్రసాద్, సురేశ్ పాల్గొన్నారు.

కాళేశ్వరంలో కార్తీక పూజలు

22 నుంచి నవంబరు 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు


కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం

మహదేవపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి క్షేత్రంలో ఈనెల 22 నుంచి కార్తీక మాసం ప్రత్యేక పూజలు, వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈనెల 22 నుంచి నవంబరు 20 వరకు కార్తీక మాసం సందర్భంగా వివిధ రకాల ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని దేవస్థానం అధికారులు ఆదివారం వెల్లడించారు.

- ప్రతి దినం ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, సాయంత్రం 6 గంటల వరకు రుద్రాభిషేకం జరుగనుంది. దేవాలయంలో సామూహిక దీపోత్సవ కార్యక్రమం జరగనుండగా పాల్గొనే భక్తులకు దేవస్థానం తరఫున మట్టి ప్రమిదలు, వత్తులు, నూనె అందిస్తారు.
- ప్రతి దినం ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, సాయంత్రం 6 గంటల వరకు కుంకుమార్చన జరుగుతుంది.
- కార్తీక మాసంలో సోమవారాలైన ఈనెల 27న, నవంబరు 3, 10, 17 తేదీలతో పాటు నవంబరు 5న కార్తీక పౌర్ణమి రోజున దేవాలయంలో సామూహిక సహస్రదీపాలంకరణసేవ ఉంటుంది.
- కార్తీక మాసం సందర్భంగా నెల రోజుల పాటు నిత్యం సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు లక్ష బిల్వార్చన పూజలు, ఆకాశ దీపం వెలిగించే కార్యక్రమాలు ఉంటాయి.
- నవంబరు 4న వైకుంఠ చతుర్దశి సందర్భంగా రాత్రి 8 గంటలకు భజన/ప్రవచన కార్యక్రమాలు, రాత్రి 11 గంటలకు స్వామి వారికి క్షీరాభిషేకం, లింగోద్భవ పూజలు జరుగుతాయి.
- నవంబరు 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి దేవాలయంలో సామూహిక సత్యనారాయణస్వామివ్రతాలు, రాత్రి 7 గంటలకు జ్వాలాతోరణం నిర్వహించనున్నారు.
- ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటలకు గోదావరి హారతి కార్యక్రమం, సమయానుకూలంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని అధికారులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిలుపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నష్కల్ సమీపంలోని ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన కథనం ప్రకారం... నష్కల్‌కు చెందిన గొడుగు రమేష్ అనేవ్యక్తి అతని ట్రాక్టర్ ద్వారా నిత్యం ఆకేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడని, అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేపట్టామని స్పష్టం చేశారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాల్చిన సీతాఫలం.. రుచి ఘనం


మల్లంపల్లిలో కాల్చిన సీతాఫలం కాయలు

పాలకుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ, బాద్రపద మాసం వచ్చాయంటే పక్కతి పరంగా లభిస్తున్న సీతాఫలం సమయం వచ్చినట్లే. మక్కిన సీతాఫలం తింటే తియ్యదనంతోపాటు మధురంగా ఉండడం సహజం. నేటి తరానికి పండు మాత్రమే కాకుండా కాల్చిన కాయల గురించి అంతంగా తెలియదు. గ్రామీణప్రాంతాల్లో ఇప్పటికీ కాల్చిన సీతాఫలం కాయలను పెద్దలు ఇష్టంగా తింటారు. చెట్టుమీద నుంచి సేకరించిన కాయలను మంటల్లో నల్లగా కాల్చి చల్లారిన తర్వాత రెండు ముక్కలుగా చేస్తే పొడిపొడిగా తెల్లగా ఎండే గుజ్జు రుచిగా ఉంటుంది. కాల్చిన కాయలు ధర సీతాఫలం పండును పోల్చి చూస్తే రెట్టింపుగానే ఉండటం విశేషం. మల్లంపల్లి గ్రామంలోని శివారులో కొందరు యువకులు సీతాఫలం కాయలను కాలుస్తూ తింటున్న పరిస్థితి ఉంది.

22 నుంచి రామప్పలో కార్తీక మాసోత్సవాలు



వెంకటాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పరమశివుడికి అత్యంత ఇష్టమైన మాసం కార్తీక మాసం. యేటా దీపావళి పండుగ మరుసటి రోజు కార్తీక మాసం ప్రారంభమవుతుంది. ఈసారి ఈనెల 22 నుంచి ప్రారంభం కానుంది. కార్తీక మాసం వచ్చే నెల 20వ తేదీ వరకు కొనసాగుతుందని రామప్ప దేవాలయ కార్యనిర్వహణ అధికారి బిల్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన దేవాలయం ఆవరణలో బ్రోచర్‌ను విడుదల చేసి విలేకరులతో మాట్లాడారు. కార్తీక మాసంలో శివారాధన చేయడం మంచిదని, అశ్వయుజ బహుళ అమావాస్య ఈనెల 21వ తేదీతో అశ్వయుజ మాసం ముగుస్తుందని అన్నారు. అక్టోబరు 22 నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుందని, ఈ మాసంలో నెలరోజులపాటు రామప్ప దేవాలయంలో అభిషేకం చేయించుకునే వారు రూ.1,116 చెల్లించి రశీదు పొందాలని అన్నారు. రూ.1,116 చెల్లించి అభిషేకం చేయించుకునే వారికి ప్రసాదంతోపాటు శేషవస్త్రాలు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

శివారాధన చేస్తూ..

కార్తీక మాసంలో ప్రతిరోజు ఒకపూట ఆహారం తీసుకుంటారు. శివారాధన చేయడంతోపాటు ఉపవాసం చేస్తే ఆరోగ్యపరంగా మంచిదని పండితులు చెబుతున్నారు. ఈ మాసమంతా పూజలు, వ్రతాలు, వనభోజనాలు జరుగుతాయి. కార్తీక సోమవారానికి ఎంతో విశిష్టత ఉంది. ఆ రోజు భక్తులు అత్యంత నిష్టతో శివుడిని పూజించి ఉపవాసం ఉంటారు. రాత్రికి శివపూజ చేసిన తర్వాత ఫలాలు తీసుకుని ఉపవాసాన్ని ముగించడం సంప్రదాయం. కార్తీక మాసంలో దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను హిందువులు దర్శించుకుంటారు. శివారాధనతో కుటుంబం ఆరోగ్యంతోపాటు సుఖసంతోషాలతో ఉంటామన్న విశ్వాసంతో ఆలయ దర్శనాలను చేసుకుంటారని రామప్ప ఆలయ ప్రధాన అర్చకులు కోమళ్లపల్లి హరీష్‌శర్మ, మోహనమఠం ఉమాశంకర్ సూచించారు.

కొడకండ్ల అభివృద్ధికి నిధులు తెస్తా : ఎమ్మెల్యే


ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిలను సన్మానిస్తున్న నేతలు

కొడకండ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిని కొడకండ్ల మండల నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండల అధ్యక్షుడు సురేష్ నాయక్, కొడకండ్ల పట్టణ అధ్యక్షుడు మసురం రవీందర్ ఆధ్వర్యంలో నాయకులు యశస్విని, ఝాన్సీరెడ్డిలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సన్మానించారు. నాయకులు మండలంలో చేపట్టాల్సిన ముఖ్యమైన అభివృద్ధి పనులను, ప్రజల రవాణా అవసరాలను, బస్సు మార్గాల పొడిగింపు గురించి వారి దృష్టికి తీసుకెళ్లారు. తొర్రూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులను వయా నాంచారిమడూర్ మీదుగా కొడకండ్ల మార్గం ద్వారా నడిచేవిధంగా చూడాలని, సూర్యాపేట, యాదగిరిగుట్ట బస్సులను తిరుమలగిరి వరకు కాకుండా పాలకుర్తి వరకు పొడిగించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే బోడతండా నుంచి తొండకు, కడగుట్ట తండా నుంచి తొండ వరకు, బ్లాక్ ఆఫీస్ నుంచి సూర్యాపేట జిల్లాలోని మామిడాల తండా వరకు రోడ్డు వేయించాలని కోరారు. ఈకార్యక్రమంలో పసునూరి మధుసూదన్, దేశగాని నాగరాజు, దామర సంతోష్, మురళి పాల్గొన్నారు.


నర్సంపేట మార్కెట్‌లో వర్షానికి కొట్టుకుపోతున్న మొక్కజొన్నలను దగ్గరకు చేస్తున్న మహిళా రైతులు

నోటికాడి బుక్క నేలపాలాయే..

- నర్సంపేట డివిజన్‌లో వర్షం
- వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన మొక్కజొన్నలు
- కన్నీరు మున్నీరైన అన్నదాతలు

నర్సంపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షం అన్నదాతలను నట్టేట ముంచింది. పంట నూర్పి, కోత కోసి మార్కెట్‌కు తీసుకొచ్చి అమ్ముకునే దశలో నోటికాడి బుక్క నేల పాలైనట్లుగా వర్షపు నీటిలో మొక్కజొన్న పంట కొట్టుకుపోతుంటే ఆ రైతుల వేదన అంతా ఇంతా కాదు. నర్సంపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో కురిసిన అకాల భారీ వర్షానికి రైతులు ఆరబోసుకున్న మొక్కజొన్నలు తడిసిముద్దయ్యాయి. కొంత మంది రైతుల మొక్కజొన్నలు వర్షపు నీటిలో కొట్టుకుపోయాయి. ఉదయం ఎండ ఉండడంతో రైతులు మార్కెట్ ఆవరణలో మక్కలను ఆరబోసుకున్నారు. అకస్మాత్తుగా గాలిదుమారంతో కూడిన వర్షం కురవడంతో అన్నదాతలు అయోమయానికి గురయ్యారు. దీంతో మార్కెట్‌లో ఆరబోసుకున్న మక్కలు తడిసిపోయాయి. చాలా మంది రైతుల మక్కలు నీటిలో కొట్టుకు పోవడంతో తలలు పట్టుకున్నారు. టార్పాలిన్ కవర్లు కప్పే ప్రయత్నం చేసినా వరద నీటిలో పంట కొట్టుకుపోయింది. కొట్టుకుపోతున్న మక్కలను రాశులుగా చేసేందుకు, మక్కల వద్ద నిలిచిన నీటిని తొలగించేందుకు రైతులు నానా పాట్లు పడ్డారు. కొద్ది రోజుల కిందట మార్కెట్‌కు తీసుకువచ్చిన మొక్కజొన్నలను ఉదయం ఆరబోసుకొని రాత్రివేళ రాశులుగా చేసుకొని వాటిపై కవర్లు కప్పుకోవడానికి నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మార్కెట్‌లో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం, వ్యాపారులపై ఆధారపడడంతో ఈ ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు వాపోతున్నారు. వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మక్క రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.


నర్సంపేట మార్కెట్‌లో తడిసిన మక్కలను ఎత్తుతున్న మహిళా రైతు

ఈడబ్ల్యూఎస్‌పై దుష్ప్రచారాన్ని ఆపాలి

- కమిషన్ ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించాలి
- ఓసీ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు
- రంగశాయిపేటలో ఓసీ జేఏసీ రాష్ట్ర సదస్సు


సదస్సులో అభివాదం చేస్తున్న ఓసీ సంఘాల నాయకులు

శంభునిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాల్లోని పేదల కోసం పోరాడి సాధించుకున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌పై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు సూచించారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో ఈడబ్ల్యూఎస్ కమిషన్ ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో ఉమ్మడివరంగల్ ఓసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఓసీ సంఘాల రాష్ట్ర కన్వీనర్ గోగు జైపాల్‌రెడ్డి అధ్యక్షతన రంగశాయిపేట బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ సమావేశానికి బ్రాహ్మణ, వెలమ, రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఆర్యవైశ్య, మార్వాడి సామాజిక వర్గాల నాయకులు హాజరయ్యారు. పోలాడి రామారావు, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, గోగు జైపాల్‌రెడ్డి, నడివెళ్లి వెంకటేశ్వర్‌రావు జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా రామారావు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి జరిగిన పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం అగ్ర వర్ణాల పేదలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను కల్పించిందన్నారు. అయితే ఇందులో లోపాలు ఉన్నాయని, వెంటనే ఈడబ్ల్యూఎస్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. గోగు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ఓసీల్లో ఉన్న రెడ్లు కర్ణాటకలో బీసీల్లో ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా ఈ తరం పోరాటం చేయకపోతే రెండు తరాల తరువాత వారు భారతదేశంలో తమకు అవకాశాలు లేకుండా చేశారని మనల్ని విమర్శిస్తారని అన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడివెల్లి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఓసీలు ఏ కులానికి, మతానికి వ్యతిరేకం కాదన్నారు. విద్య, ఉపాధి, రాజకీయాలలో ఈబీఎస్ రిజర్వేషన్‌లను సరిగ్గా వినియోగించుకోవటం లేదన్నారు. ఓసీ పేదలంతా ప్రతీ సంవత్సరం విధిగా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. జనాభా దామాషా ప్రకారం 20 శాతం రిజర్వేషన్ల కోసం ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. లక్ష మందితో వరంగల్‌లోనే ఓసీ సింహగర్జన సభను నిర్వహించి ఓసీల బలాన్ని ప్రభుత్వానికి చూపెడుదామని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, రెడ్డి సంఘాల రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చందుపట్ల నర్సింహారెడ్డి, వైశ్య సంఘాల నేతలు దుబ్బ శ్రీనివాస్, తోట సురేష్, వంగ అశోక్, మాధవ్ శంకర్, వెలమ సంఘం నాయకులు ఎన్.వెంకటేశ్వర్‌రావు, పాపారావు, కమ్మ, మార్వాడీ సంఘాల నాయకులు రాయపాటి వెంకటేశ్వర్ రావు, మందడి వేణుగోపాల్, రాష్ట్ర ఓసీ జేఏసీ మహిళా అధ్యక్షురాలు కంకనాల సరోజన, జాతీయ సలహాదారు రావుల నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత అనుమానాస్పద మృతి

- మొగిలిచర్ల సమీపంలో మృతదేహం
- జాగిలాలతో పోలీసుల దర్యాప్తు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే చల్లా



రాజు మృతదేహం, రాజు (ఫైల్)

గీసుగొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో బీఆర్ఎస్ నాయకుడు మృతి చెందాడు. ఈ ఘటన 15వ డివిజన్ మొగిలిచర్ల సమీపంలోగల కంచెలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... 16వ డివిజన్ గొర్రెకుంట గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ల్యాదెల్ల రాజు(లవ్‌రాజు)(45) శనివారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో పని ఉందని బయటకు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో అతడి భార్య ప్రియాంక, కుటుంబీకులు రాజుకు ఫోన్ చేసినా ఎత్తలేదు. దీంతో పలు చోట్ల అతడి ఆచూకీ ప్రయత్నించారు. అయితే ఆదివారం ఉదయం మొగిలిచర్ల సమీపంలోని కెనాల్ పక్కన గల కంచెలో రాజు మృతదేహం పడి ఉంది. దీంతో కుటుంబీకులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. కాగా, ఘటనాస్థలాన్ని చేరుకున్న సీఐ విశ్వేశ్వర్, ఎస్ఐ కుమార్, అనిల్‌కుమార్ పోలీసు జాగిలాలను, క్లూస్ టీంను హుటాహుటిన రప్పించి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మృతుడి ఫోన్‌కు వచ్చిన కాల్ డాటా, లొకేషన్‌లు, క్లూస్‌టీం, పోస్ట్‌మార్టం రిపోర్టు ఆధారంగా సమగ్ర విచారణ జరిపి మృతికి కారణాలను వెల్లడిస్తామని సీఐ తెలిపారు. మృతుడి భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

మృతిపై అనుమానాలు

బీఆర్ఎస్ నాయకుడు రాజు మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజు అటువైపు ఎందుకు వెళ్లారు..? అక్కడ ఏమి జరిగింది..? వాహనం కూడా వెళ్లలేని ప్రదేశంలోకి ఒక్కడే వెళ్లారా..? అతడితో ఇంకెవరైనా వెళ్లారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి శరీరంపై ఎటువంటి గాయాలు లేకపోయినప్పటికీ గొంతుభాగంలో కొంత కమిలి ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కొన్నేళ్ల కిందట గుండెకు స్టంట్ పడిన రాజుకు హార్ట్‌స్ట్రోక్ వచ్చి ఉంటుందా? అని అనుమానిస్తున్నారు. వాహనంపై నుంచి వెళుతుంటే హార్ట్‌స్ట్రోక్‌తో పడిపోతే వాహనం సెంటర్ స్టాండ్ ఎలా వేసి ఉంటుందని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పోలీసులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.


ఘటనా స్థలం వద్ద మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి, నాయకులు

ఘటనా స్థలాన్ని పరిశీలించిన చల్లా

ఘటనా స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితోపాటు మాజీ జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, డీసీసీబీ డైరెక్టర్ రమేష్, నాయకులు సుంకరి శివకుమార్, గోలి రాజయ్యలు చేరుకొని పరిశీలించారు. మృతుడి కుటుంబాన్ని వారు పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాజు మృతిపై సీఐ విశ్వేశ్వర్‌తో ధర్మారెడ్డి మాట్లాడి ఆరా తీశారు.


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
సోమవారం 20 అక్టోబరు 2025















కేసముద్రం మార్కెట్లో తడిచిన మొక్కజొన్నలు

వర్షంతో తడిసిన మొక్కజొన్నలు

కేసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో ఆరబెట్టుకున్న రైతుల మొక్కజొన్నలు ఆదివారం మధ్యాహ్నం ఆకస్మిక వర్షంతో తడిచిపోయాయి. చెల్కల వద్ద ఆరబెట్టేందుకు కల్లాలు లేకపోవడంతో మార్కెట్‌లోని ఓపెన్ యార్డు, కవర్‌షెడ్లలో కొద్దిరోజులుగా రైతులు మొక్కజొన్నలను ఆరబెట్టుకుంటున్నారు. సరైన తేమశాతం రాగానే విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఆకస్మికంగా కొద్దినిమిషాల పాటు వర్షం రావడం, ఈ లోగా ఆరబెట్టిన మొక్కజొన్నలను దగ్గరకు చేసే సమయంలేక వానలో తడిచిపోయాయి.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం

మహబూబాబాద్ అగ్రికల్చర్ : మార్క్‌ఫెడ్, సహకార శాఖ ఆధ్వర్యంలో మక్కల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మహబూబాబాద్, కేసముద్రం విలేజ్, ధనసరి మర్రిగూడెం, పొగుళ్లపల్లి, గార్ల, గూడూరు, తొర్రూరు, బయ్యారం కేంద్రాల్లో ప్రాథమిక సహకార సంఘాలు ఈ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో హడావుడిగా యార్డులలో కేవలం మొక్కజొన్నలు కొనుగోలు చేస్తున్నట్లుగా బ్యానర్ ఏర్పాటు చేశారు. మొక్కజొన్నల ఖరీదులు మాత్రం చేపట్టలేదు. బుధవారం నుంచి మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు తెలిసింది.

నేడే దీపాల పండుగ



మహబూబాబాద్ నెహ్రూసెంటర్‌లో బంతిపూలను విక్రయిస్తున్న చిరు వ్యాపారులు



మహబూబాబాద్ టపాసుల కొనుగోలు చేస్తున్న ప్రజలు

- జిల్లా వ్యాప్తంగా దీపావళి సందడి
- వ్రతాల వెలుగులు, నోములు, పూజలు..
- జనంతో పటాసుల దుకాణాలు కళకళ
- పూలతో గుబాళించిన కూడళ్లు
- రద్దీగా మారిన పట్టణాలు, పల్లెలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దీపావళి సందడి నెలకొంది. పట్టణాలతో పాటు పల్లెలు బంధుమిత్రులతో కళకళలాడు తున్నాయి. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సోమవారం (నేడు) దీపావళి పర్వదినం జరుపుకోనున్నారు. 21న వ్రతాలు (నోములు) చేసుకునేందుకు ప్రజలంతా సన్నద్ధమయ్యారు. భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందే పండుగల్లో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేదాలకు తావులేకుండా సమైక్యంగా జరుపుకునే పండుగే దివ్య దీప్తుల దీపావళి. జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి. నరకాసురుడనే రాక్షసుడిని సంహరించిన మరుసటి రోజు అతడి పీడవదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి చేసుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. మరో కథనంలో.. లంకలోని రావణుడిని సంహరించి శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చేటప్పుడు ప్రజలు ఆనందోత్సహాల మధ్య దీపావళిని జరుపుకున్నారని కూడా చెప్పుకుంటారు.

చీకటిని పారద్రోలుతూ.. వెలుగులు తెచ్చే పండుగనే కాకుండా విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారని పెద్దలు చెబుతున్నారు. దీప మాళికల శోభతో వెలుగొందే గృహం గణాలు ఆనంద కోలాహలంతో వెల్లివిరిసే అబాల గోపాలం, నూతన వస్త్రాల రెపరెపలు, పిండి వంటల ఘుమఘుమలు, బాణాసంచా పేలుళ్లు.. దీపావళి సోయగాలు ఈ పండుగ ప్రత్యేకతలు. ఏటా ఆశ్వయుజ అమావాస్య రోజున వస్తుంది. దీపాల పండుగకు ముందురోజు ఆశ్వయుజ బహుళ చతుర్ధశి రోజును నరక చతుర్ధశిగా జరుపుకుంటారు.

పర్వదినాన వ్రతాలు..

దీపావళి రోజున ధనలక్ష్మీ వ్రతం, కేదారీశ్వరీ వ్రతం, గౌరీ నోములు నోయడం (మిగతా 8లో..)

ఆర్టీసీ బస్సులు, రైళ్లు కిటకిట..

దీపావళి పండుగకు పట్టణాల నుంచి పల్లెలకు ప్రజలు తరలి వస్తుండడంతో అటు ఆర్టీసీ బస్సులు, రైళ్లలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఈనెల 18న బీసీ బంద్‌తో ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ఇవ్వగా, పట్టణాల నుంచి పల్లెల రావడానికి ఆర్టీసీ బస్సులు నడవకపోవడం, ట్రాక్ మరమ్మత్తుల దృష్ట్యా పలు రైళ్లు రద్దు కావడంతో ప్రయాణీలు చేయలేక పోయారు. ఈనెల 20న దీపావళి పర్వదినం ఉండడంతో ఆదివారం భారీగా ప్రజలు గ్రామాలకు తరలి రావడంతో బస్సులు, రైళ్లు కిక్కిరిసి పోయాయి.



'క్రీడా పోటీలతోనే మానసికోల్లాసం'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత అంబరీశ

మరిపెడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : క్రీడా పోటీలతోనే మానసికోల్లాసం ఉంటదని మరిపెడ పట్టణ కాంగ్రెస్ నేత గంధసిరి అంబరీశ అన్నారు. ఆదివారం మరిపెడ మునిసిపాలిటీ పరిధిలోని యువకుల కోసం బోడా రమేశ్ నేతృత్వంలో ధమాకా టోర్నీ నిర్వహించగా ఆయన ఆ టోర్నీ ప్రారంభించి మాట్లాడారు. యువత చెడు మార్గాలవైపు చూడొద్దన్నారు. శరీర ధారుఢ్యం కోసం క్రీడలపై యువత మక్కువ పెంచుకోవాలన్నారు. వాలిబాల్, క్రికెట్, కబడ్డీ క్రీడాకారుల కోసం ఆ ఆటలు ఆడి ఉత్సాహం నింపారు. మరిపెడ మాజీ సర్పంచ్ పానుగోత్ రాంలాల్, తాజొద్దీన్, అప్జల్, మెంచు అశోక్, సంతోశ్‌రెడ్డి, మద్దోజు వెంకన్న పాల్గొన్నారు.

కుక్క దాడి.. బాలుడికి గాయాలు

తొర్రూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పిచ్చి కుక్క దాడిలో ఇద్దరికి గాయాలైన సంఘటన తొర్రూరు మండలం వెల్లికట్ట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... గ్రామంలో పిచ్చికుక్క గత వారం రోజులు సంచరిస్తుంది. ఈ క్రమంలో ఉదయం కుంభం మహేష్ అనే వ్యక్తికి కరిచి గ్రామంలో ఇంటి ముందు ఆడుతున్న 3వ తరగతి చదువున్న బాలుడు పబ్బాల అయాన్‌పై దాడి చేసి ఛాతిపై గాయాలు చేసింది. అయాన్ తండ్రి రాము హుటాహుటీన తొర్రూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు వైద్యాధికారులు పంపించడంతో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

12 మందిపై కేసు

మరిపెడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బీసీ జేఏసీ ఇచ్చి నటువంటి బంద్ లో భాగంగా మరిపెడలో చోటుచేసుకున్న ఘర్షణలో బీజేపీకి చెందిన పన్నెండు మందిపై కేసు నమోదు చేసినట్లు మరిపెడ అదనపు ఎస్సై కోటేశ్వర్‌రావు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బంద్ రోజు మరిపెడ బస్టాండ్ బస్టాండ్‌లో జరిగిన ఘర్షణలో కొండం దశరథం అనేక వ్యక్తిని బూతులు తిట్టి, చంపుతామని బెదిరించడంతో బీజేపీకి చెందిన భూక్యా లింగంనాయక్, అనిల్, మంగమ్మ, బింగి రమేశ్, ధరావత్ నరేశ్, గుగులోత్ లక్ష్మణ్, కుదురుపాక విష్ణు, గంగాధర జనార్దన్, పులి శ్రీనివాస్, మారబోయిన నాగరాజులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

కోళ్లవ్యాన్ బోల్తా..

- చికిత్స పొందుతూ ఇద్దరు మృతి.. ఒకరికి గాయాలు
- ఖమ్మం - వరంగల్ జాతీయ రహదారిపై ఘటన
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ గణేష్




బోల్తాకొట్టిన కోళ్లవ్యాన్‌ను పరిశీలిస్తున్న సీఐ గణేష్

తొర్రూరు రూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం నుంచి వరంగల్ వైపు వస్తున్న కోళ్లవ్యాన్ బోల్తా కొట్టి చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందగా ఒకరు గాయపడిన సంఘటన తొర్రూరు మండలం పత్తేపురం గ్రామ శివారులో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మం డలం గంట్లకుంట గ్రామానికి చెందిన జిన్నా రామనుజా (38) స్నేహ చికెన్ కోళ్ల వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన అర్ర దయాకర్ (40) అదే కంపెనీలో సూపర్‌వైజర్‌గా, జనగామ జిల్లా చిల్పూరుకు చెందిన గాదె రాజయ్య కూలీ పనిచేస్తుంటారు. ఈ క్రమంలో రోజు మాదిరిగా ముగ్గురు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామంలోని కోళ్లఫారం నుంచి కోళ్లను వేసుకొని మరిపెడ, దంతాలపల్లి మండలాల్లో కోళ్లను వేసి తొర్రూరులో వేయడానికి వస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున సుమారు 2 గంటల ప్రాంతంలో తొర్రూరు మండలం పత్తేపురం గ్రామ శివారు ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపై ఖమ్మం వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రామానుజా, దయాకర్, రాజయ్యకు గాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా రామానుజా, దయాకర్ ఉదయం 8 గంటల సమయంలో మృతి చెందగా రాజయ్య ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. రోడ్డు ప్రమాద సంఘటన వద్దకు తొర్రూరు సీఐ గణేష్, ఎస్సై ఉపేందర్, శివ చేరుకొని పరిశీలించారు. ఈ ఘటన పై స్నేహచికెన్ వెహికిల్ ప్లాంట్ ఇన్‌చార్జి వేముల శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గొళ్లముడి ఉపేందర్ తెలిపారు.













నీటి గుంతలో పడి బాలుడి మృతి


సాత్విక్ మృతదేహం

ఇనుగుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్ననాగారంలో ఆదివారం ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి ఉడత సురేష్, హేమలత దంపతుల ఒక్కగానొక్క కుమారుడు సాత్విక్ (7) ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ జి.కరుణాకర్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలోని ప్రైవేటు స్కూల్‌లో యూకేజీ చదువుతున్న సాత్విక్, మరో ఇద్దరు చిన్నారులతో కలిసి ఇంటికి సమీపంలో ఆడుకుంటున్నాడు. ఆ ప్రాంతంలోనే ఉన్న చిన్న నీటిగుంతలో ప్రమాదవశాత్తు సాత్విక్ పడిపోవడంతో మిగిలిన ఇద్దరు పిల్లలు భయంతో ఏడుస్తూ ఇంటికి పరిగెత్తుకొని వచ్చి సాత్విక్ తాత వెంకటమల్లుకు తెలిపారు. వెంకటమల్లు వెళ్లి నీటిగుంతలో ఉన్న బాలున్ని వెలికి తీసేసరికి అప్పటికే మృతి చెందాడు. బాలుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఈ దంపతులకు గతంలో ఒక కుమారుడు, ఒక కుమార్తె అనారోగ్యంతో మృతి చెందగా ఉన్న ఒక్కగానొక్క కొడుకు విగత జీవిగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

మహిళపై చేయిచేసుకున్న ఐదుగురిపై కేసు

మరిపెడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బీసీ జేఏసీ ఈనెల 18న చేపట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్‌లో భాగంగా మరిపెడలో ఓ మహిళపై బీసీ నేతలు చేయిచేసుకున్న సంఘటనలో ఐదుగురిపై అట్రాసిటీ కింద కేసు నమోదైనట్లు మరిపెడ అదనపు ఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపారు. బాధితురాలు భూక్యా మంగమ్మ ఫిర్యాదు మేరకు కొండం దశరథం, తాళ్లపెల్లి వెంకన్న, గుండగాని మధుసూదన్, గుండగాని వేణు, అక్కినపల్లి వెంకట్‌సాయిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని అతిగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన చెదల జయరాజు (48) వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. రూరల్ ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. కంబాలపల్లికి చెందిన జయరాజు సుతారి మేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 17న మహబూబాబాద్‌లో పని ముగించుకుని సొంత గ్రామం కంబాలపల్లికి ద్విచక్రవాహనంపై బయలు దేరారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లికి చెందిన కల్యాణపు సురేష్ తన ద్విచక్రవాహనంపై వరంగల్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో జమాండ్లపల్లి ఆకేరు బ్రిడ్జీ సమీపంలో సుతారీ మేస్త్రీ జయరాజు బైక్‌ను సురేష్ వెనుక నుంచి ఢీకొట్టగా జయరాజు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని జిల్లా ఆస్పత్రి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య పూలమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుమారుడు పవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కల్యాణపు సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గడ్డిమందు తాగి ఒకరి ఆత్మహత్య

కేసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది గడ్డిమందు తాగి పెనుగొండకు చెందిన లాక లక్ష్మయ్య (50) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ క్రాంతికిరణ్ ఆదివారం తెలిపారు. లక్ష్మయ్య కొంతకాలంగా మద్యానికి బానిస కాగా, కుటుంబసభ్యులు ఆయనకు చికిత్స చేయించారు. అయినప్పటికీ మద్యం మానకుండా మళ్లీ బానిసయ్యాడు. దీంతో తనకు ఎవరూ విలువ ఇవ్వడంలేదని మనస్థాపానికి గురై ఈనెల 17న రాత్రి ఏడు గంటల ప్రాంతంలో చెల్క వద్ద గడ్డిమందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆయన్ను తొలుత మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య సుమ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు కేసునమోదు చేసుకున్నట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

నవంబర్ 9న ఆదివాసీల చలో మానుకోట


మహబూబాబాద్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నాయకులు

నెహ్రూసెంటర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 9న ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన చలో మానుకోట బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వర్‌రావు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కొమురంభీం సెంటర్‌లో ఆదివారం చలో మానుకోట వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి వరకు లంబాడీలు అక్రమంగా ఎస్టీ జాబితాలో చొరబడి రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగ బద్ధంగా ఎస్టీ జాబితాలో లంబాడీలను కలుపలేదని ఆరోపించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342ను నిబంధనను పాటించకుండా అతిక్రమిస్తూ జాబితాలోకి చొరబడ్డారని పేర్కొన్నారు. తక్షణమే ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని డిమాండ్ చేశారు. 9న లక్షలాది మంది ఆదివాసీలు మానుకోటకు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామస్వామి, జార కృష్ణ, నాగేశ్వర్‌రావు, కుంజ నర్సింహారావు, జనార్దన్, బొల్లి సారయ్య, కల్తీ నరేష్, రామస్వామి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

గీతవృత్తికి ప్రభుత్వం రక్షణ కల్పించాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తిగౌడ్

గార్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగించే కార్మికుల వృత్తి ప్రమాదంలో పడిందని, ఈ వృత్తి జీవించే కార్మికులకు ప్రభుత్వం రక్షణ కల్పించి ఆదుకోవాలని గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు దొంతు రామూర్తి గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గీత పనివారల సంఘం 68వ వార్షికోత్సవం సందర్భంగా సెంటర్‌లో సంఘం జెండాను ఎగర వేసి అనంతరం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తోడేటి కొమరయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గీతవృత్తి ప్రమాదంలో ఉన్నప్పుడు సంఘం సభ్యులు ఏకతాటిపై నిలబడి గీత వృత్తిని కాపాడుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ గీత కార్మికుల సమస్యలపైరాష్ట్ర స్థాయిలో ఫెడరేషన్ ఏర్పాటు చేసి వృత్తి నమ్ముకొని జీవించేవారికి ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి చిర్ర వెంకటేశ్వర్లు గౌడ్, జిల్లా కోశాధికారి నక్క నాగార్జున గౌడ్, తోడేటి శ్రీనుగౌడ్, వెంకటరాజ్యం గౌడ్, తాళ్లపల్లి కృష్ణాగౌడ్, గాజుల కృష్ణాగౌడ్, రాంబాబు గౌడ్, కత్తిసత్యం గౌడ్, గట్టు శంకర్ గౌడ్, కోలా కుమార్ గౌడ్ పాల్గొన్నారు.


తోడేటి కొమరయ్యను సన్మానిస్తున్న కార్మికులు

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి ధర్నా

కురవి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సీరోలు మండలం తాళ్లసంకీస శివారు వస్త్రంతండా జీపీ పరిధిలోని ఓ తండాకు చెందిన ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు ధర్నాకు దిగింది. తండవాసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం. పాలిటెక్నిక్ చదివిన శివశంకర్ అదే తండాకు చెందిన మేజర్ బాలికను ప్రేమించాడు. ఈ క్రమంలో పెళ్లికి శివశంకర్ నిరాకరించడంతో ప్రియుడి ఇంటిముందు ప్రియురాలు ధర్నాకు దిగింది. ఈ విషయమై సీరోలు పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

ట్రస్మా జిల్లా అధ్యక్షుడిగా యాకాంతంగౌడ్



కేసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కేసముద్రం శ్రీవివేకవర్ధిని హైస్కూల్ కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్‌ను ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మహమూద్‌పట్నంలో ఆదివారం సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2025-27 విద్యాసంవత్సరాలకుగాను జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శిగా డోర్నకల్‌కు చెందిన వక్కంతుల అప్పారావు, కోశాధికారిగా తొర్రూరుకు చెందిన కేతిరెడ్డి నరేష్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు యాకాంతంగౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రమేష్‌రావు, రాఘవేంద్రరెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేష్‌రావు, భూపాల్‌రావు, శంభారెడ్డి, దేవేందర్ రెడ్డి, జి.ఎన్.రెడ్డి, జయప్రకాశ్, పరమాత్మాచారి పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఈనెల 24, 25 తేదీల్లో జరిగే గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ నుంచి సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశాన్ని ఆకుల రాజు అధ్యక్షతన ఆదివారం ఆన్‌లైన్ (జూమ్)లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని గార్లలో తొలిరోజు ఈ నెల 24న గార్లలో జరిగే భారీ ర్యాలీకి జీపీ కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, సమ్మెట రాజమౌళి, కందునూరి శ్రీనివాస్, దుండి వీరన్న, పోతుగంటి మల్లయ్య, కుమ్మరికుంట్ల నాగన్న, ధార స్నేహబిందు, సంపూర్ణ, మౌనిక పాల్గొన్నారు.

చెడుపై విజయమే నరకాసుర వధ

మేయర్ గుండు సుధారాణి

వైభవంగా నరకాసుర వధ వేడుకలు

జనసంద్రమైన ఉర్సుగుట్ట కుడా ప్రాంగణం

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా విన్యాసాలు

కరీమాబాద్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకయే నరకాసుర సంహారమని అని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆదివారం నగరంలోని ఉర్సు గుట్ట కుడా మైదానంలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు వైభవంగా కొనసాగాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానిక ముఖ్య అతిథులుగా మేయర్ గుండు సుధారాణి, భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకుడు శేషు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. భారతదేశంలో ప్రతీ పండుగకు ఓ పురాణం ఉంటుందని, పండుగలకు తెలంగాణ ప్రాంతం ప్రత్యేకతను సంతరించుకుందని అన్నారు. పోరాట పటిమ గల దేవీ సత్యభామ స్త్రీలకు ఆదర్శమన్నారు. భద్రకాళి శేషు మాట్లాడుతూ.. మనలోని అవలక్షణాలను త్యజిస్తేనే లక్ష్యం సిద్ధిస్తుందని అన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా సనాతన ధర్మం పరిఢవిల్లుతుందని, సనాతన ధర్మాన్ని కాపాడటంలో ఎన్ని అవరోధాలు అడ్డు వచ్చిన తుదకు ధర్మానిదే విజయమని అన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మమార్గాన్ని అనుసరించాలని అన్నారు. అప్పుడే లోకకల్యాణం జరుగుతుందన్నారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి చేతుల మీదుగా రిమోట్‌తో నరకాసుర వధను ప్రారంభించారు.

అంతకు ముందు వేడుకల్లో భాగంగా సాయంత్రం 6 గంటలకు శ్రీ కృష్ణ సత్యభామ వేషాధారణలో కళాకారులను ఊరేగింపుగా వేదికకు తీసుకొచ్చారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో ఉర్సు గుట్ట కుడా మైదానం కిక్కిరిసిపోయింది. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. నరకాసుర వధ ఘట్టం, ప్రత్యేక బాణాసంచా వెలుగులు ప్రజలను ఆకట్టుకున్నాయి. వేడుకల నిర్వహణకు సహకరించిన దాతలను ముఖ్య అతిథులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు పోషా పద్మస్వామి, భోగి సువర్ణ సురేష్, పల్లం పద్మ, నరకాసుర వధ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల కోసం పోరాడిన నారాయణ

● **సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి**


నున్న నారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అణగారిన వర్గాల ప్రజల కోసం పోరాడిన కమ్యూనిస్టు నాయకుడు నున్న నారాయణ వారి గుండెల్లో నిలిచిపోయారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి అన్నారు. నారాయణ నగర్ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి నారాయణ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నారాయణ పోరాటాలు కొనసాగించారని చెప్పారు. పంజాల ఉపేంద్ర, జం గ కళావతి, జనగం సైదులు, ఎస్కే ముస్తఫా, బోనగిరి దేవేందర్, ఇమాంబీ, తోట పుష్ప, శైలజ, సునిత పాల్గొన్నారు.

గీత కార్మికుల పక్షాన కేజీకేఎస్ పోరాటాలు

● **జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న**

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గీత కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం వారి పక్షాన కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) నిరంతర పోరాటాలు కొనసాగిస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో ఆదివారం కేజీకేఎస్ 68వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘం జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న ఎగురవేసి ప్రసంగించారు. కల్లుగీత కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, పరిష్కారం కోసం పాలకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గౌడ కులస్థుల అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసి అందుకు ప్రభుత్వం ప్రత్యేకనిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు గునిగంటి మోహన్, బబ్బూరి ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు, పానుగంటి వీరస్వామి, యాకన్న, సత్యనారాయణ, రామన్న, శ్రీనివాస్, వెంకన్న, వీరస్వామి, రాజశేఖర్ పాల్గొన్నారు.


కల్లుగీత కార్మిక సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న గౌని వెంకన్న

రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

వీరారం బొత్తలతండాలో ఈ అరుదైన ఘటన


రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

మరిపెడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఓ ఆవు రెండు దూడలకు జన్మనిచ్చింది. ఈ అరుదైన ఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వీరారం శివారు బొత్తలతండాలోని హనీ డెయిరీ ఫామ్‌లో చోటుచేసుకుంది. బొత్తలతండాకు చెందిన ధరంసోత్ జయేందర్-సంగీతలు పీజీ వరకు చదవి ఆ తండా శివారులోని వారి వ్యవసాయ భూమిలో గత కొంత కాలంగా హనీ డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్నారు. వారి డైరీ ఫామ్‌లోని ఓ ఆవుకు మరిపెడ పశువైద్యాశాలలో కృత్రిమ గర్భధారణ చేయించారు. ఆ ఆవు ఆదివారం తెల్లవారు జామున రెండు దూడెలకు (మగ) జన్మనిచ్చింది. ఆ యువ రైతులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పరిసర ప్రాంతాల ప్రజలు అశ్చర్యం చెందుతున్నారు. స్థానికులు ఆ ఆవు దూడెలను చూసి వెళుతున్నారు.

గోదావరి వద్ద భక్తజన సందడి

మహదేవపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని కాళేశ్వరం గోదావరి వద్ద ఆదివారం భక్తజనం పోటె త్తారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణలోని పలు ప్రాంతా ల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆనవాయితీ ప్రకారం దీపావళి ముందు పుణ్య స్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. అక్కడి పుణ్య జలాలు, ఇసుకను ఇళ్లలోకి తీసుకెళ్లి నోములు నోచుకుం టారు. ఈ క్రమంలోపెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మాస శివరాత్రి సందర్భంగా కాళేశ్వరాలయంలో ఆదివారం చండీ హోమం నిర్వహించారు. ఆలయ వేద పండితులు పలు మంత్రోచ్చరణలతో హోమాన్ని నిర్వహించారు. ప్రతి మాసశివరాత్రి స్వామివారి సన్నిధానంలో చండీ హోమాన్ని నిర్వహించడం విశేషం.


గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



నెహ్రూసెంటర్‌లో బంతిపూలను విక్రయిస్తున్న చిరు వ్యాపారులు, ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణం

నేడే దీపాల పండుగ

(7వ పేజీ తరువాయి)

తెలుగింటి సంప్రదాయ ఆచారంగా కొనసాగుతోంది. ఇళ్లు, ఆలయాల్లో దీపాలను అలంకరించి వెలుగులు నింపడం చెడుపై మంచి సాధించిన ఈ తిథిరోజు ఆకాశాన్ని తాకేటట్టుగా దిక్కులు ప్రకాశవం తమైయ్యేలా బాణాసంచా కాలుస్తారు. దీపావళి అమావాస్య మొదలుకుని కార్తీకపౌర్ణమి పక్షం రోజులు వివిధ వ్రతాలు, నోములు, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. పిల్లలకు, పెద్దలకు దీపావళి పండుగ అంటే మహాసరదా, దేశ వ్యాప్తంగా చిన్నలు, పెద్దలు టపాసులు కాలుస్తూ ఆనందోత్సాహంగా జరుపుకుంటారు. కేదారీశ్వరి వ్రతం హిందువులు ఆచరించే ఉత్కృష్టమైన వ్రతంగా చెప్పుకుంటారు. ఈ రోజు ఇంటిల్లిపాది కఠోరా ఉపవాసం ఉండి కేదారీశ్వరుని రూపం లోనూ శివుడిని ధ్యానిస్తారు. ఈ నోము నోచుకున్న వారికి అష్టఐశ్వర్యాలకు, అన్నవస్త్రాలకు లోటు ఉండదని భక్తుల అపార విశ్వాసం. వ్రతం పూర్తి చేసిన అనంతరం నక్షత్ర దర్శనం చేసుకుని స్వామికి నివేదించిన వాటినే ప్రసాదంగా తీసుకుంటారు. ఈ వ్రత మహాత్మ్యం వలనే పార్వతిదేవి శివుని అర్ధశరీరాన్ని పొందిందని పురాణాల్లో పేర్కొన్నారు.

పూలు, ప్రమిదలు, మామిడాకుల కొనుగోళ్లు..

మానుకోట జిల్లా కేంద్రంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధాన కూడళ్లలో మహిళలు పూలు, ప్రమిదలు, మామిడాకులు కొనుగోళ్ల చేశారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో పూల తోటలు వేసిన రైతులు ఆటోల్లో తీసుకువచ్చి విక్రయించగా, పట్టణానికి చెందిన కొందరు చిరు వ్యాపారులు వాళ్ల వద్ద కొనుగోల్లు చేసి పట్టణంలో అమ్మకాలు జరిపారు. బంతి పూలు కిలోకు రూ. 40 కాగా పూలు మాలకట్టి మూరెడు పూలకు రూ. 25 చొప్పున అమ్మకాలు జరిపారు. దీపాలు పెట్టె ప్రమిదలు సైజును బట్టి రూ. 10కి నాలుగు, ఆరు చొప్పున అమ్మకాలు జరిపారు.

ఎన్టీఆర్ స్టేడియంలో టపాసుల దుకాణాలు..

దీపావళి పండుగ సందర్భంగా టపాసులను అమ్మేందుకు మహబూబాబాద్ జిల్లా కేం ద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసి దుకాణాలు జనంతో కళకళలాడాయి. ప్రతి ఏటా టపాసుల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలు కొనుగోళ్లకు ఆసక్తి చూపకపోవడంతో వెల వెలబోయేవి. ఈసారి దీపావళి మందుల ధరలు పెరగక పోవడంతో గత ఏడాది ధరలే ఉం డడంతో ప్రజలు భారీగా కొనుగోళ్లు చేయడం కన్పించింది. దీంతో ఎన్టీఆర్ స్టేడియం ప్రాం గణమంతా జనంతో నిండిపోయింది. ఈ ఏడాది భారీగా కొనుగోళ్లు జరగడంతో దుకాణా నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఎస్ఆర్ఆర్ ట్రేడర్స్‌లో కేజీ టపాసులు రూ.548 విక్రయించడంతో అక్కడ కొనుగోలు చేయడానికి ఆసక్తి కనపరిచారు.

'జీవితాన్ని ఛిద్రం చేసుకోవద్దు'

మరిపెడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలకు అలవాటు పడి అమూల్యమైన జీవితాన్ని ఛిద్రం చేసుకోవొద్దని ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల హైస్కూల్‌కు చెందిన ప్రభాకర్ సెలవు రోజుల్లో మాదక ద్రవ్యాలపై అవగాహన కలిపిస్తూ బైక్ యాత్ర చేస్తున్నారు. ఆదివారం ఈ యాత్ర మరిపెడబంగ్లాకు చేరుకొంది. స్థానిక అంగడి సెంటర్లో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనార్థాలను ప్రజలకు వివరించారు. తన బాల్య మిత్రుడు ధూమపానానికి బానిసై క్యాన్సర్ బారినపడి మృతి చెందాడని, అతడిలా మరొకరు ప్రాణాలు కోల్పోవద్దని ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2500 కిలోమీటర్లు బైక్ యాత్ర ఇప్పటి వరకు నిర్వహించడం జరిగిందన్నారు.

పేపర్ బాయ్ కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న న్యూస్ పేపర్ ఎస్సార్లు, ఏజంట్లు

బయ్యారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : న్యూస్ పేపర్ బాయ్‌గా పనిచేస్తూ ఇటీవల జ్వరంతో మృతి చెందిన గోగుల అజయ్ కుటుంబానికి ఆదివారం న్యూస్ పేపర్ ఎస్సార్లు, ఏజంట్లు ఆర్థిక సాయం అందజేశారు. బయ్యారం బాలుర ఉన్నత పాఠశాల్లో పదో తరగతి చదువుతున్న జగ్గుతండాకు చెందిన గోగుల అజయ్ ఖాళీ సమయంలో న్యూస్ పేపర్ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా నిలిచేవాడు. ఈ క్రమంలోనే డెంగీ జ్వరం సోకి ఈనెల 8న అజయ్ మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో అజయ్ కుటుంబానికి ఆర్థికంగా చేయుతనిచ్చేందుకు జిల్లాలోని వివిధ పత్రికలకు చెందిన ఎస్సార్లు, ఏజంట్లుతో పాటు పాఠకుల నుంచి విరాళాలు సేకరించారు. దాతల నుంచి సేకరించిన రూ. 10 వేలను ఆదివారం న్యూస్ పేపర్ డిస్ట్రిబూటర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఆంధ్రజ్యోతి ఏసీవో బిడుదల గోపాల్ చేతుల మీదిగా అజయ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో న్యూస్ పేపర్ ఎస్సార్లు, ఏజంట్లు శ్రీనివాస్, అశోక్, సారంగపాణి పాల్గొన్నారు.